సాక్షి విశాఖపట్నం

శనివారం । 6 । సెప్టెంబర్ । 2025

దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం స్నాతకోత్సవంలో పాల్గొన్న సుప్రీం కోర్టు న్యాయమూర్తులు జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జె.కె.మహేశ్వరి, జస్టిస్ పి.నరసింహా, రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, వీసీ సూర్యప్రకాశరావు



ఉత్తమ అవార్డులు అందుకున్న ఉపాధ్యాయులతో మంత్రి, ఎంపీ, ఎమ్మెల్సీ, కలెక్టర్



గురువులదే గురుతర బాధ్యత

- జిల్లా ఇన్‌చార్జి మంత్రి డోలా
- 90 మంది ఉత్తమ ఉపాధ్యాయులకు ఘన సన్మానం
- ఘనంగా గురుపూజోత్సవం

ఆరిలోవ: ఈ ఏడాది ప్రభుత్వ పాఠశాలల్లో 10వ తరగతిలో శతశాతం ఉత్తీర్ణత సాధించే దిశగా ఉపాధ్యాయులు కృషి చేయాలని జిల్లా ఇన్‌చార్జి మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి సూచించారు. విద్యార్థులను ఐఐటీ, ఎన్ఐటీల్లో సీట్లు సాధించే స్థాయికి తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు. గతేడాది 10వ తరగతి ఫలితాల్లో గురుకుల పాఠశాలల్లో ఎక్కువ మంది విద్యార్థులు 590 మార్కులు దాట గా, జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో కేవలం నలుగురైదుగురు మాత్రమే ఆ ఘనత సాధించడం ఆలోచించాల్సిన విషయమని ఉపాధ్యాయులకు చురకంటించారు. జిల్లా విద్యా శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం ఏయూలోని డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ హాల్‌లో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం జరిగింది. ఈ సందర్భంగా జిల్లాలోని వివిధ పాఠశాలల నుంచి ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన 90 మందిని ఘనంగా సత్కరించారు. జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు అందించారు. అనంతరం మంత్రి డోలా మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైందని, ఉత్తమ సమాజ నిర్మాణం కోసం విద్యార్థులను తీర్చిదిద్దే గురుతర బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. కొందరు విద్యార్థులు మత్తు పదార్థాలకు బానిసలవుతున్నారని, వారిలో మార్పు తీసుకురావాల్సిన బాధ్యత గురువులదేనని సూచించారు. విద్యార్థులతో స్నేహపూర్వకంగా మెలగాలని, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని హామీ ఇచ్చారు. ఎంపీ శ్రీభరత్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తగ్గకుండా చూడాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని, విద్యా వ్యవస్థలో రాజకీయ ప్రమేయం తగదన్నారు. ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు మాట్లాడుతూ దేశానికి అవసరమైన మానవ వనరులను తయారుచేసే శక్తి ఉపాధ్యాయులకే ఉందన్నారు. కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ మాట్లాడుతూ పోటీ ప్రపంచానికి అనుగుణంగా విద్యార్థులను తీర్చిదిద్దాలని కోరారు. డీఈవో ఎన్.ప్రేమకుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.



ఉపాధ్యాయురాలిని సత్కరిస్తున్న మంత్రి, ఎంపీ



ఆకట్టుకున్న విద్యార్థులు నృత్యరూపకం



డీఎస్ఎన్ఎల్‌యూ స్నాతకోత్సవంలో పట్టాలు తీసుకోవడానికి వచ్చిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులు

పట్టాల పండగ.. ఆనందం నిండుగ

- ఘనంగా డీఎస్ఎన్ఎల్‌యూ స్నాతకోత్సవం
- ఐదు బ్యాచ్‌ల విద్యార్థులకు పట్టాల ప్రదానం
- అతిథులుగా హాజరైన సుప్రీం, హైకోర్టు న్యాయమూర్తులు
- పట్టాలతో కేరింతలు కొట్టిన విద్యార్థులు

విశాఖ సిటీ: దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం(డీఎస్ఎన్ఎల్‌యూ) పట్టభద్రుల కేరింతలతో బీచ్‌రోడ్డు మార్మోగిపోయింది. తెలుగు రాష్ట్రాల నుంచే దేశంలో పలు రాష్ట్రాల నుంచి విశాఖలో న్యాయ విద్యను పూర్తి చేసిన విద్యార్థులు నోవాటెల్ హోటల్‌లో సందడి చేశారు. శుక్రవారం హోటల్‌లో డీఎస్ఎన్ఎల్‌యూ స్నాతకోత్సవం ఘనంగా నిర్వహించారు. గత ఐదేళ్లలో యూనివర్సిటీలో పలు కోర్సుల్లో ఉత్తీర్ణులైన వారికి పట్టాల అందించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, అతిథులుగా జస్టిస్ జె.కె.మహేశ్వరి, జస్టిస్ పి.నరసింహా, రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ హాజరయ్యారు. అతిథుల చేతుల మీదుగా విద్యార్థులను బంగారం, వెండి పతకాలతో పాటు పట్టాలను అందజేశారు. ఇందులో 397 మంది బీఏ ఎల్ఎల్‌బీ, 153 మందికి ఎల్ఎల్ఎం, నలుగురికి పీహెచ్‌డీ, ఇద్దరికి ఎల్ఎల్‌డీ పట్టాలు అందించారు. అలాగే 153 మందికి బంగారు పతకాలు ప్రదానం చేశారు. బ్యాచ్‌ల వారీగా విద్యార్థులు న్యాయమూర్తులతో ఫొటోలు దిగారు. ఈ సందర్భంగా న్యాయమూర్తులు ప్రసంగించారు.



విద్యార్థుల సందడి



గుంటూరుకు చెందిన జ్యోతిర్మయికి మాస్టర్స్ పట్టా అందజేస్తున్న జస్టిస్ సూర్యకాంత్

వర్సిటీతోనే కాకుండా తమ జీవిత అనుభవాలను విద్యార్థులకు వివరించారు. విద్యార్థులు జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.

విద్యార్థుల సందడి : కోవిడ్, ఇతరత్రా కారణలతో గత ఐదేళ్లుగా డీఎస్ఎన్ఎల్‌యూ స్నాతకోత్సవం వాయిదా పడుతూ వస్తోంది. ఈ ఐదేళ్లలో న్యాయ విద్యను పూర్తి చేసిన వారు ఇప్పటికే సుప్రీం కోర్టు, పలు రాష్ట్రాల్లో హైకోర్టులు, జిల్లా కోర్టుల్లో ప్రాక్టీసులు ప్రారంభించారు. 8 నుంచి 12 బ్యాచ్‌లకు ఒకేసారి పట్టాలు అందించేందుకు డీఎస్ఎన్ఎల్‌యూ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ డాక్టర్ డి.సూర్యప్రకాశరావు స్నాతకోత్సవాన్ని నిర్వహించారు. దీనికి పలు రాష్ట్రాల్లో స్థిరపడిన న్యాయ విద్యార్థులు శుక్రవారం విశాఖకు వచ్చారు. తమ స్నేహితులను కలుసుకుని కేరింతలు కొడుతూ సందడి చేశారు. తమ ప్రొఫెసర్లతో ముచ్చటించారు. ఐదేళ్ల తర్వాత అందరూ స్నాతకోత్సవం ద్వారా కలుసుకోవడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు.

ఇది మాకు పండగే..



ఐదేళ్ల తర్వాత ఇంత ఘనంగా స్నాతకోత్సవం జరగడం నిజంగా మాకు పండుగలా ఉంది. కోవిడ్, ఇతర కారణాలతో కాన్వోకేషన్ ఆలస్యమైంది. 2021లో న్యాయ విద్యను పూర్తి చేశాను. ప్రస్తుతం హైకోర్టులో ప్రాక్టీస్ చేస్తున్నా. ఇప్పుడు ఈ కార్యక్రమం ద్వారా అందరినీ కలుసుకోవడం చాలా ఆనందంగా ఉంది. ఈ స్నాతకోత్సవానికి సుప్రీంకోర్టు, హైకోర్టు న్యాయమూర్తులు హాజరవడం గర్వంగా ఉంది. వారి అనుభవాలతో అందించిన ప్రసంగం స్ఫూర్తిదాయకం.

– ఎం.మనోజ్, 2021 న్యాయ విద్యార్థి

ఉత్సాహం నింపింది



దేశంలో నల్సార్ వంటి యూనివర్సిటీలో ఈ తరహా వేడుకలు జరుగుతుంటాయి. ఇప్పుడు డీఎస్ఎన్ఎల్‌యూ నిర్వహించడం అద్భుతంగా ఉంది. దీనికి దేశ, రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానాల జడ్జీలు రావడంతో సంతోషంగా ఉంది. ఇది మాకు మరింత ఉత్సాహాన్ని ఇచ్చింది. న్యాయమూర్తుల అనుభవాలు తమకు జీవితంలో ఉపకరిస్తాయి. ఇటువంటి కార్యక్రమం నిర్వహించిన వైస్‌చాన్సలర్ సూర్యప్రకాష్‌కు కృతజ్ఞతలు.

– సాయి దత్తా, న్యాయవిద్యార్థి

భార్గవశర్మకు 3 బంగారు పతకాలు



విశాఖకు చెందిన భార్గవ శర్మ మూడు సబ్జెక్టుల్లో బంగారు పతకాలను అందుకున్నారు. సుప్రీం కోర్టు న్యాయమూర్తి జస్టిస్ పి.ఎస్.నరసింహం వీటిని ప్రదానం చేశారు. భార్గవ శర్మ 2021లో డీఎస్ఎన్ఎల్‌యూ నుంచి న్యాయశాస్త్రంలో 5 సంవత్సరాల డిగ్రీ పూర్తి చేశారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో న్యాయవాదిగా ప్రాక్టీస్ చేస్తున్నారు. కాగా 2021–22 బ్యాచ్‌కు చెందిన అడ్వకేట్ కుమార్ నిఖిల్ నాలుగు స్వర్ణపతకాలు అందుకున్నాడు.



యువతుల ఆనందహేల

ఓనం ముగ్గుమనోహరం







ఓనం పండగ సందర్భంగా మురళీనగర్ ప్రాంతంలో రంగుల శోభ వెల్లివిరిసింది. విశాఖ కేరళా సమితి శుక్రవారం సాయంత్రం నిర్వహించిన ఈ రంగుల పోటీల్లో మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఏటా జరిగే ఓనం పండగ ముందు ఈ పోటీలు నిర్వహిస్తారు. ఈ ప్రాంతంలో ఓనం పండగకు ఏర్పాట్లు చేశారు.

– ఫొటోలు : సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

కిక్కిరిసిన జనం.. ఏర్పాట్లలో వైఫల్యం

- విశాఖ ఫుడ్ ఫెస్టివల్ ప్రారంభం
- కిటకిటలాడిన ఫుడ్ స్టాళ్లు
- ఫుడ్ లవర్స్‌కు నిరాశ



చెఫ్‌లకు బహుమతి అందజేస్తున్న అతిథులు



ఏర్పాట్లలో వైఫల్యంతో రద్దీగా మారిన ప్రాంగణం

బీచ్‌రోడ్డు: సాగరతీరంలోని ఎంజీఎం గ్రౌండ్స్‌లో శుక్రవారం విశాఖ ఫుడ్ ఫెస్టివల్ 2025 ప్రారంభమైంది. ఈ పండగకు ప్రజల నుంచి స్పందన లభించినప్పటికీ, నిర్వాహకుల వైఫల్యం కారణంగా ఫుడ్ లవర్స్ తీవ్ర నిరాశకు గురయ్యారు. ప్రజల రాకను అంచనా వేయడంలో అధికారులు విఫలమవడంతో, ప్రాంగణం వేలాది మందితో కిక్కిరిసిపోయింది. నిలబడటానికి కూడా స్థలం లేకపోవడం, ఒకే మార్గంలో రాకపోకలు సాగించాల్సి రావడంతో తోపులాట జరిగి, గాలి ఆడక ప్రజలు ఉక్కపోతతో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఆశించిన స్థాయిలో సాంస్కృతిక ప్రదర్శనలు లేకపోవడం కూడా వారిని నిరుత్సాహపరిచింది. అయితే, ఈ ఫెస్టివల్‌లో ఏర్పాటు చేసిన డిన్నర్ ఆన్ బోట్ కార్యక్రమం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. విద్యుత్ కాంతుల్లో, అలల సవ్వడి మధ్య బోట్లపై భోజనం చేసే అవకాశం సందర్శకులను ఆకట్టుకుంది. ముందుగా ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి అజయ్ జైన్.. ఈ ఏడాది డిసెంబర్‌లో విశాఖ ఉత్సవ్ నిర్వహిస్తామని ప్రకటించారు. విశాఖను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, భవిష్యత్తులో మరిన్ని మెగా ఈవెంట్లు నిర్వహిస్తామన్నారు. 2026 ఫిబ్రవరిలో ఇంటర్నేషనల్ ఫ్లీట్ రివ్యూ, సిటీ పరేడ్ ఉంటుందన్నారు. అనంతరం స్టార్ చెఫ్ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. అతిథులంతా ఫుడ్ స్టాళ్లను సందర్శించి వంటకాల రుచి చూశారు. విశాఖ ఎంపీ శ్రీభరత్, కలెక్టర్ హరేందిర ప్రసాద్, టూరిజం శాఖ అధికారులు జె.మాధవి, జగదీష్, ఫోరమ్, వివిధ అసోసియేషన్ల ప్రతినిధులు పాల్గొన్నారు.



డిన్నర్ ఆన్ బోట్: రుచులను ఆస్వాదిస్తున్న అతిథులు

చెరువు కాదు.. స్టేడియమే..

జనసేన నిర్లక్ష్యానికి నిదర్శనం



వర్షం నీటితో చెరువులా దర్శనమిస్తున్న ఇందిరాగాంధీ మున్సిపల్ క్రికెట్ స్టేడియం

జగదాంబ : అవునండీ నిజమే.. ఇది జీవీఎంసీ 35వ వార్డులో ఉన్న ఇందిరా మున్సిపల్ క్రికెట్ స్టేడియమే.. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో స్టేడియాన్ని రూ.5 కోట్ల మేర నిధులు వెచ్చించి మెరుగుపరిచారు. అయితే ఇటీవల జనసేన కార్యకర్తల సమావేశం కోసం మైదానాన్ని తవ్వేసి వదిలేశారు. దీంతో కురుస్తున్న వర్షాలకు స్టేడియం చెరువులా మారింది. ఆటలాడుకోవడానికి అవకాశం లేకుండా పోయిందని క్రీడాకారులు ఆవేదన వ్యక్తం చేశారు.

జనసేన కార్యకర్తల సమావేశానికి ముందు స్టేడియం



భక్తిశ్రద్ధలతో మిలాద్ ఉన్ నబీ

దాబాగార్డెన్స్: జగత్ ప్రవక్త మహ్మద్ రసూలుల్లాహ సల్లాలాహు అలహి వసల్లం 15వ శతాబ్ది జయంతి వేడుకైన ఈద్ ఎ మిలాద్ ఉన్ నబీ వేడుకను ముస్లింలు శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు. సీరత్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో విశాఖ మహానగరంలోని వివిధ మసీదులకు చెందిన ముస్లింలు నగరంలో భారీ శాంతి ర్యాలీ జరిపారు. రిజర్వు లైన్ మసీదు వద్ద ప్రారంభమైన శాంతి ర్యాలీ డాల్ఫిన్ జంక్షన్, విశాఖ ప్రభుత్వ మహిళా కళాశాల జంక్షన్, సెవెన్‌హిల్స్ జంక్షన్, జగదాంబ జంక్షన్, టర్నర్ చౌల్ట్రీ, పూర్ణామార్కెట్, ఏవీఎన్ కాలేజీ డౌన్‌రోడ్డు, టౌన్ కొత్త రోడ్డు, రీడింగ్‌రూమ్, కురుపాం మార్కెట్, వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ మీదుగా పాతపోస్టాఫీస్ కోటవీధి హజ్రత్ ఇషాక్ మదిని ఔలియా రహితుల్లాలై దర్గా వరకు సాగింది. ర్యాలీ పొడవునా ఇస్లామిక్ జెండాలు చేతబట్టిన చిన్నారులు, తెల్లటి గుర్రాలు, ఒంటెలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ర్యాలీలో పాల్గొన్న ముస్లింలు ప్రవక్త సూక్తులను స్మరించుకున్నారు. సీరత్ కమిటీ అధ్యక్షుడు మునీర్ ఖాన్ బాబా, ప్రధాన కార్యదర్శి జిలానీ, కోశాధికారి అసిఫ్, కార్పొరేటర్ భర్కత్ అలీ, హైదర్ అలీ షింకా, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఇసాక్, వ్యవస్థాపకుడు షబ్బీర్, రఫీ మాట్లాడారు. అనంతరం దర్గా వద్ద ముస్లిం మత గురువు ఫాతిహా నిర్వహించారు.



మిలాద్ ఉన్ నబీ శాంతి ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లింలు

నూతన విద్యావిధానంతోనే వికసిత భారత్



ఆచార్య సంఘమిత్ర బందోపాధ్యాయను సత్కరిస్తున్న వీసీ ఆచార్య రాజశేఖర్, రిజిస్ట్రార్ ఆచార్య రాంబాబు

ఏయూలో ఘనంగా సైన్స్ కాంక్లేవ్

మద్దిలపాలెం: ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని, ఆంధ్ర విశ్వవిద్యాలయం శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా 'స్వర్ణాంధ్ర, వికసిత భారత్–2047 కోసం సైన్స్ అండ్ టెక్నాలజీ ఫ్రాంటియర్స్'అనే అంశంపై సైన్స్ కాంక్లేవ్‌ను ఘనంగా నిర్వహించింది. ఏయూ కన్వెన్షన్ సెంటర్‌లో శుక్రవారం జరిగిన ఈ కార్యక్రమంలో మాజీ రాష్ట్రపతి, ఏయూ పూర్వ వీసీ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పద్మశ్రీ గ్రహీత, ఇండియన్ స్టాటిస్టికల్ ఇన్‌స్టిట్యూట్ డైరెక్టర్ ఆచార్య సంఘమిత్ర బందోపాధ్యాయ ప్రసంగించారు. వికసిత భారత్–2047 లక్ష్యాన్ని చేరుకోవడానికి నూతన విద్యావిధానం దోహదపడుతుందన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఒక సవాలని, దానిపై పూర్తి అవగాహన లేకపోతే నష్టం తప్పదని హెచ్చరించారు. విద్యార్థులు టెక్నాలజీపై పూర్తిగా ఆధారపడకుండా, బృంద చర్చల ద్వారా నూతన ఆవిష్కరణలకు కృషి చేయాలని సూచించారు. ప్రత్యేక అతిథి భారత వాతావరణ శాఖ డైరెక్టర్ జనరల్ డాక్టర్ మృత్యుంజయ్ మహాపాత్ర.. వాతావరణ మార్పులు, గ్లోబల్ వార్మింగ్ వల్ల కలిగే విపత్తుల గురించి వివరించారు. టెక్నాలజీని ఉపయోగించి వాతావరణ మార్పులను ఎప్పటికప్పుడు గమనించాల్సిన అవసరాన్ని నొక్కిచెప్పారు. సదస్సులో భాగంగా ఆంధ్ర విశ్వవిద్యాలయం.. నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్, హైదరాబాద్‌తో రెండు అవగాహన ఒప్పందాలు కుదుర్చుకుంది. కార్యక్రమంలో ఏయూ వీసీ ఆచార్య జి.పి.రాజశేఖర్, నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్(హైదరాబాద్) డైరెక్టర్లు డాక్టర్ ప్రకాశ్ చౌహాన్, డాక్టర్.వి.ఎం.చౌదరి, ఏపీటీసీ చైర్మన్ డాక్టర్ సిహెచ్ మోహన్‌రావు, ఐఐటీ హైదరాబాద్ పూర్వ సంచాలకుడు ఆచార్య జి.నరహరి శాస్త్ర, రెక్టార్ ఆచార్య కిశోర్‌బాబు, రిజిస్ట్రార్ కె.రాంబాబు, ప్రిన్సిపాళ్లు, డీన్‌లు, డైరెక్టర్లు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రికి ఘన స్వాగతం



మహారాణిపేట : ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడికి శుక్రవారం ఉదయం విశాఖలో జిల్లాలో ఘనస్వాగతం లభించింది. రాడిసన్ బ్లూ హోటల్‌లో ఇంటర్నేషనల్ మీడియేషన్ కాన్ఫరెన్స్‌లో పాల్గొనేందుకు వచ్చిన ఆయనకు జిల్లా ఇన్‌చార్జి మంత్రి డాక్టర్ డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామి, హోం మంత్రి వంగలపూడి అనిత, ఎంపీలు శ్రీ భరత్, సీఎం రమేష్, మేయర్ పీలా శ్రీనివాసరావు, ప్రభుత్వ విప్‌లు గణబాబు, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు, ఎమ్మెల్యేలు, కలెక్టర్ హరేందిర ప్రసాద్, పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి, జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్, ఇతర అధికారులు ఘన స్వాగతం పలికారు. సదస్సు అనంతరం రుషికొండ హెలిప్యాడ్ నుంచి 11.50 గంటలకు ఉండవల్లికి తిరుగు పయనమయ్యారు.

జాతీయ అవార్డు స్వీకరించిన తిరుమల శ్రీదేవి



భీమునిపట్నం : భీమిలిలోని నెహ్రూ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు తిరుమల శ్రీదేవి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా జాతీయ ఉత్తమ ఉపాధ్యాయురాలి అవార్డును ఢిల్లీలో శుక్రవారం స్వీకరించారు. ఆమె మన రాష్ట్రం నుంచి జాతీయ ఉత్తమ ఉపాధ్యాయురాలిగా ఎంపికైన విషయం తెలిసిందే. ప్రత్యేక విధానం ద్వారా విద్యార్థులకు బోధన అందించడం ద్వారా ఆమె ఈ పురస్కారానికి ఎంపికయ్యారు.

జిల్లా సమీక్ష మండలి సమావేశం నేడు

మహారాణిపేట: జిల్లా సమీక్ష మండలి(డీఆర్సీ) సమావేశం శనివారం ఉదయం 10.30 గంటలకు కలెక్టర్ కార్యాలయంలో జరగనుంది. జిల్లా ఇన్‌చార్జి మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొంటారు. ఈ సమావేశం కోసం తొమ్మిది అంశాలతో కూడిన అజెండాను రూపొందించారు.

కరెంట్ సమస్య.. క్షణాల్లో పసిగట్టేలా..

- ఈపీడీసీఎల్ పరిధిలో సబ్‌స్టేషన్లకు 'స్కాడా' అనుసంధానం
- మొదటి విడతలో 40 స్టేషన్లలో అమలు
- మరో 24 స్టేషన్లలో పనులు వేగవంతం

ఆటోమేటిక్ ఫీడర్ చేంజ్ రూమ్





స్కాడా పరిధిలోని సబ్‌స్టేషన్లను పర్యవేక్షిస్తున్న సిబ్బంది

సాక్షి, విశాఖపట్నం: ఒకప్పుడు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడితే, సమస్య ఎక్కడుందో కనుగొనడానికి సిబ్బంది క్షేత్రస్థాయిలో గంటల తరబడి శ్రమించాల్సి వచ్చేది. లోపం ఉన్న ప్రాంతాన్ని గుర్తించి, సబ్‌స్టేషన్‌కు సమాచారమిచ్చి, విద్యుత్ సరఫరా నిలిపివేసిన తర్వాత మరమ్మతులు చేసేవారు. ఈ ప్రక్రియకు గంట నుంచి రెండు గంటల సమయం పట్టేది. కానీ, ఆధునిక సాంకేతికత అందుబాటులోకి రావడంతో పరిస్థితులు మారాయి. ఇప్పుడు విద్యుత్ సరఫరాలో లోపం ఎక్కడ తలెత్తిందో క్షణాల్లోనే కంప్యూటర్ స్క్రీన్‌పై కనిపిస్తోంది. ఆ సమాచారంతో సంబంధిత సిబ్బంది కేవలం 5 నుంచి 30 నిమిషాల్లోనే సమస్యను పరిష్కరించి విద్యుత్ సరఫరాను పునరుద్ధరిస్తున్నారు. ఇది తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఈపీడీసీఎల్) పరిధిలో అమలు చేస్తున్న సూపర్‌వైజరీ కంట్రోల్ అండ్ డేటా అక్విజిషన్ (స్కాడా) వ్యవస్థతో సాధ్యమవుతోంది. విశాఖపట్నం సర్కిల్ పరిధిలో ఇప్పటికే సగానికి పైగా సబ్‌స్టేషన్లు స్కాడాతో అనుసంధానం కావడంతో నగరవాసులకు విద్యుత్ సమస్యలు గణనీయంగా తగ్గాయి.

స్కాడా అంటే..?

విద్యుత్ సరఫరా వ్యవస్థను ఒకే కేంద్రం నుంచి పర్యవేక్షిస్తూ.. సమస్యలు తలెత్తినప్పుడు వెంటనే పరిష్కరించి, సరఫరాను పునరుద్ధరించడానికి ఏర్పాటు చేసిన ఆధునిక వ్యవస్థే స్కాడా. ఇది సెన్సార్లు, రిమోట్ టెర్మినల్ యూనిట్ల ద్వారా సబ్‌స్టేషన్లను కంట్రోల్ సెంటర్‌తో అనుసంధానిస్తుంది. ఆపరేషనల్ టెక్నాలజీ ద్వారా రియల్ టైమ్ డేటాను సేకరించి, వ్యవస్థను పూర్తిస్థాయిలో నియంత్రించడానికి వీలు కల్పిస్తుంది. సాధారణంగా సబ్‌స్టేషన్లలో షిఫ్ట్ ఆపరేటర్లు చేసే పనులను స్కాడా కంట్రోల్ సెంటర్ నుంచే ఆటోమేటిక్‌గా, రిమోట్ సెన్సార్ల సహాయంతో నిర్వహిస్తారు.

వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో...

విశాఖ నగరంలో స్కాడా ఏర్పాటుకు 2013లో ప్రతిపాదనలు రాగా, 2014లో రూ.13.16 కోట్లతో పనులు ప్రారంభమయ్యాయి. 2015 నుంచి మొదలుపెడితే 28 సబ్‌స్టేషన్లను స్కాడా కంట్రోల్ స్టేషన్‌కు అనుసంధానం చేశారు. 2019లో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చిన తరవాత మరో 12 స్టేషన్లను అనుసంధానం చేయడంతో పాటు మరో 24 సబ్‌స్టేషన్లను స్కాడా పరిధిలోకి తీసుకొచ్చే పనులు ప్రారంభమై.. చివరి దశకు చేరుకున్నాయి. త్వరలోనే ఈ సబ్‌స్టేషన్లలోనూ స్కాడా అమలుకానుంది. విశాఖపట్నం సర్కిల్ పరిధిలో మొత్తం 130 విద్యుత్ సబ్ స్టేషన్లు ఉండగా, ప్రస్తుతం 40 స్టేషన్లు ఈ ఆధునిక వ్యవస్థ ద్వారా పనిచేస్తున్నాయి. మరో 24 స్టేషన్లలో త్వరలోనే సేవలు మొదలుకానున్నాయి. మిగిలిన కేంద్రాలను కూడా భవిష్యత్తులో అనుసంధానించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.

కంట్రోల్ సెంటర్ ఎక్కడంటే..?

స్కాడా పరిధిలోని అన్ని సబ్‌స్టేషన్లను పెదవాల్తేరులోని పోలమాంబ ఆలయం సమీపంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ సెంటర్ నుంచి పర్యవేక్షిస్తారు. ఇది అత్యంత కీలకమైన, సాంకేతికతతో కూడిన కార్యాలయం కావడంతో దీనిని నియంత్రిత ప్రాంతంగా (నిషిద్ధ ప్రాంతం) పరిగణిస్తారు. సైబర్ నేరగాళ్లు హ్యాక్ చేసి నగర విద్యుత్ వ్యవస్థను అస్తవ్యస్తం చేసే ప్రమాదం ఉన్నందున ఇక్కడ కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. ఈపీడీసీఎల్ ప్రత్యేక నిపుణుల బృందం (ఈఈ, డీఈఈ, ఏఈ స్థాయి అధికారులతో పాటు 8 మంది షిఫ్ట్ ఇంజినీర్లు) ఈ కేంద్రాన్ని 24/7 పర్యవేక్షిస్తోంది. స్కాడాకు అనుసంధానించిన సబ్‌స్టేషన్ పరిధిలో ఎక్కడైనా విద్యుత్ సరఫరాలో లోపం వస్తే, వెంటనే కంట్రోల్ రూమ్‌లో అలారమ్స్ మోగుతాయి. హై వోల్టేజ్, లో వోల్టేజ్ వంటి హెచ్చుతగ్గులను కూడా ఈ కేంద్రం నుంచే నియంత్రించవచ్చు. ఏ ప్రాంతానికి ఎంతసేపు విద్యుత్ సరఫరా చేశారు, ఎంతసేపు కోతలు విధించారు, లోడ్ ఎంత ఉంది వంటి సమాచారం మొత్తం రియల్ టైమ్ డేటా రూపంలో నిక్షిప్తమవుతుంది.

ప్రమాదాలు తగ్గుముఖం



స్కాడా కంట్రోల్ స్టేషన్ నుంచి నిరంతర పర్యవేక్షణ ఉండటంతో.. ప్రమాదాలు తగ్గుముఖం పడుతున్నాయి. విద్యుత్ సరఫరాలో నాణ్యత ఉంటోంది. స్కాడాకి అనుసంధానం చేయడం వల్ల సరఫరాలో అంతరాయాలు గుర్తించి, పునరుద్ధరించడంలో 56 శాతం వరకు సమయం ఆదా అవుతోంది. పవర్ ట్రిప్ అయితే రియల్ టైమ్‌లో తెలుస్తోంది. స్క్రీన్‌పై నుంచే వోల్టేజ్, ఇతర అంశాల్ని నిశితంగా పరిశీలించవచ్చు. ఏ చిన్న సమస్య తలెత్తినా.. పసిగట్టగలుగుతున్నాం. గతంలో ఫీడర్ మార్పు చేసేందుకు 15 నుంచి 20 నిమిషాల సమయం పట్టేది. ఇప్పుడు 2 లేదా 3 నిమిషాల్లో ఫీడర్‌ని మార్పు చేయగలుగుతున్నాం. గ్రామస్థాయిలో ఫీడర్ల వరకూ స్కాడా అనుసంధానం చేసేందుకు కొంత సమయం పడుతుంది.

–జి.శ్యామ్‌బాబు, విశాఖపట్నం సర్కిల్ ఎస్ఈ

డీఎస్ఎన్ఎల్‌యూలో అకడమిక్ బ్లాక్ ప్రారంభం



నూతనంగా నిర్మించిన అకడమిక్ బ్లాక్‌ను హైకోర్టు చీఫ్ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్‌తో కలిసి ప్రారంభిస్తున్న సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పి.శ్రీనరసింహ తదితరులు

సబ్బవరం: దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం(డీఎస్ఎన్ఎల్‌యూ)లో నూతనంగా నిర్మించిన అకడమిక్ బ్లాక్‌ను సుప్రీం కోర్టు న్యాయమూర్తి, విశ్వవిద్యాలయ విజిటర్ జస్టిస్ పి.శ్రీనరసింహ శుక్రవారం ప్రారంభించారు. దీంతో పాటు వర్సిటీ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన జాతిపిత మహాత్మాగాంధీ, రాజ్యాంగ పిత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, తొలి దళిత ముఖ్యమంత్రి, దామోదరం సంజీవయ్య విగ్రహాలను హైకోర్టు చీఫ్ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్‌తో కలిసి ఆవిష్కరించారు. అనంతరం వర్సిటీ సమావేశమందిరంలో వాతావరణ మార్పులు, చట్టాలు అనే అంశంపై జస్టిస్ ఇ.వెంకటేశం స్మారక ఉపన్యాసం చేశారు. కార్యక్రమంలో గౌరవ అతిథిగా హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి, సుప్రీం కోర్టు సీనియర్ న్యాయవాది జస్టిస్ డీవీఎస్ఎస్ సోమయాజులు, విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య డాక్టర్ సూర్యప్రకాశరావు, ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్ విశ్వచంద్ర మదాసీ పాల్గొన్నారు.

కమీషన్ల కక్కుర్తే కారణం

- వైద్య కళాశాలల ప్రైవేటీకరణ నిర్ణయంపై వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కె.కె. రాజు
- ప్రజల చెంతకు వైద్యాన్ని తీసుకొచ్చిన ఘనత జగన్‌దే అని స్పష్టీకరణ



మహారాణిపేట: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అనేక రంగాలను ప్రైవేటీకరిస్తోందని.. అదే విధంగా కమీషన్ల కోసమే రాష్ట్రంలో ఉన్న వైద్య కళాశాలలను పీపీపీ పద్ధతిలో ప్రైవేటీకరించేందుకు క్యాబినెట్‌లో నిర్ణయం తీసుకుందని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కె.కె. రాజు మండిపడ్డారు. దీనిని తాము తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. నాటి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి పేదవాడికి ఆరోగ్య భద్రత కల్పించాలని, పేదవాడికి అందని ద్రాక్షగా ఉన్న వైద్య విద్యను దగ్గర చేయాలనే దృఢ సంకల్పంతో రాష్ట్రంలో సుమారు 17 మెడికల్ కాలేజీల నిర్మాణాలు చేపట్టినట్లు తెలిపారు. కూటమి ప్రభుత్వం జగన్‌కి మంచి పేరు వస్తుందనే మెడికల్ కాలేజీలను ప్రైవేటుపరం చేస్తుందని విమర్శించారు. 2019కి ముందు అధికారంలో ఉన్న తెలుగుదేశం ప్రభుత్వం 1045 వ్యాధులకు ఆరోగ్యశ్రీ ద్వారా వైద్యం అందిస్తే వైఎస్సార్‌సీపీ పాలనలో 3,275 వ్యాధులకు దానిని విస్తరించిందన్నారు. చంద్రబాబు నాయుడు ప్రభుత్వంలో కేవలం 1,000 ఆస్పత్రుల్లో మాత్రమే ఆరోగ్యశ్రీ ద్వారా వైద్యం అందిస్తే జగన్ ఆధ్వర్యంలో సుమారు 2,350 ఆస్పత్రుల్లో ఆరోగ్యశ్రీ కార్డు ద్వారా వైద్యం అందించినట్లు తెలిపారు. కరోనాకు కూడా ఆరోగ్యశ్రీ కార్డు ద్వారా వైద్యం అందించినట్లు చెప్పారు. జగన్ 45 లక్షల మంది లబ్ధిదారులకు రూ.13 వేల కోట్లు వెచ్చించి వైద్యం, రూ. 1,500 కోట్ల ఆర్థిక అసరా అందించారన్నారు. బాబు ప్రభుత్వం ఆరోగ్యశ్రీ ద్వారా రూ. 5 లక్షల వరకు మాత్రమే లబ్ధి ఇచ్చేదని, వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఆ లబ్ధిని రూ. 25 లక్షలకు పెంచిందన్నారు. ఈ రోజు వైద్య విద్యను పేదలకు దూరం చేయాలనే దురుద్దేశంతోనే ప్రభుత్వం మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరించాలని భావించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని కె.కె. రాజు స్పష్టం చేశారు.

ఏయూ ఆచార్యులకు అవార్డులు



ఏయూ ఆచార్యులను సత్కరిస్తున్న వీసీ ఆచార్య రాజశేఖర్

మద్దిలపాలెం: ఆంధ్ర విశ్వవిద్యాలయంలో శుక్రవారం ఉపాధ్యాయుల దినోత్సవం పురస్కరించుకొని పలువురు ఆచార్యులకు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ పేరున బెస్ట్ అకాడమీషన్ ఆఫ్ ది 'ఇయర్ 2025 అవార్డులను అందించారు. సెనేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఏయూ ఆచార్య జి.పి.రాజశేఖర్ అవార్డులను అందజేశారు. లా కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య సీతామాణిక్యం, సైన్స్ కళాశాల కెమిస్ట్రీ విభాగం ఆచార్యురాలు డీవీవీ శైలజ, ఇంజినీరింగ్ కళాశాల నుంచి కంప్యూటర్ సైన్స్ ఆచార్యులు వెంకట్రావులకు ఈ అవార్డులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య ఎస్. కిషోర్ బాబు, రిజిస్ట్రార్ ఆచార్య రాంబాబు, ప్రిన్సిపాల్స్ ఆచార్య ఎ.నరసింహారావు, ఆచార్య ఎం. వి. ఆర్. రాజు, ఆచార్య జి. శంకర్, ఆచార్య కె. సీతామాణిక్యం, ఆచార్య ఆర్. పద్మశ్రీ, ఆచార్య డి. నాగరాజకుమారీ ,ఎపలువురు డీన్లు, డైరెక్టర్లు, అధికారులు, ఆచార్యులు పాల్గొన్నారు.

ఆకట్టుకుంటున్న వస్త్ర ప్రదర్శన



అల్లిపురం: దేశంలోని వివిధ రాష్ట్రాలలో పేరు గాంచిన చీరలు, వస్త్రాల అమ్మకాలు గ్రీన్ పార్కు హోటల్లో నేషనల్ సిల్క్ ఎక్స్ పో సంస్థ ప్రారంభించింది. ఈ ప్రదర్శన ఈ నెల 8వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. దసరా, వివాహాది వేడుకలకు అవసరమైన అన్ని రాష్ట్రాలకు చెందిన సంప్రదాయ, ఆధునిక ఫ్యాషన్లు కలబోసిన విభిన్న వస్త్రాలను ఈ ప్రదర్శనలో ఉంచినట్లు చెప్పారు. నేషనల్ సిల్క్ ఎక్స్‌పో – ఎగ్జిబిషన్ కమ్ సేల్ సందర్శన షాపింగ్ చేయటంలోఒక అద్భుతమైన వస్త్రాల సంబరాన్ని చూసిన అనుభూతి పొందుతారని నిర్వాహకులు తెలిపారు. ఈ ప్రదర్శన ప్రతి రోజు ఉదయం 11 నుంచి రాత్రి 9 గంటల వరకు అందుబాటులో ఉంటుందన్నారు. ప్రవేశం ఉచితమని నిర్వాహకులు పేర్కొన్నారు.

13 వరకు విశాఖ-బ్రహ్మపూర్ ఎక్స్‌ప్రెస్ రద్దు

తాటిచెట్లపాలెం: వాల్తేర్ డివిజన్ పెందుర్తి-సింహాచలం పరిధిలో జరుగుతున్న భద్రతా పనుల కారణంగా ఈ మార్గంలో నడిచే పలు రైళ్లను రద్దు చేసినట్లు వాల్తేర్ డివిజన్ అధికారులు తెలిపారు. ఈ నెల 6, 8, 10, 12వ తేదీల్లో విశాఖపట్నం –బ్రహ్మపూర్(18526) ఎక్స్‌ప్రెస్, ఈ నెల 7, 9, 11, 13వ తేదీల్లో బ్రహ్మపూర్-విశాఖపట్నం(18525) ఎక్స్‌ప్రెస్, ఈ నెల 7, 9, 11, 13వ తేదీల్లో విశాఖపట్నం-విజయనగరం(67287) పాసింజర్‌ను రద్దు చేశారు. ఈ నెల 7, 9, 11, 13వ తేదీల్లో పలాస-విశాఖపట్నం (67290) పాసింజర్ విజయనగరం వరకు మాత్రమే నడుస్తుంది.

'బొకారో'దారి మళ్లింపు.. అదనపు హాల్ట్

సదరన్ రైల్వే, సేలం డివిజన్ పరిధిలో జరుగుతున్న భద్రతా పనుల వల్ల ఈ నెల 7న అలప్పుజ–ధన్‌బాద్(13352)బొకారో ఎక్స్‌ప్రెస్‌ను దారి మళ్లించినట్లు వాల్తేర్ డివిజన్ అధికారులు తెలిపారు. ఆ తేదీన ఈ రైలు వయా పాదనూర్ జంక్షన్–ఇరుగూర్ జంక్షన్, సేలం మీదుగా ప్రయాణిస్తుంది.ప్రయాణికుల సౌకర్యార్థం పాదనూర్‌లో అదనపు హాల్ట్ కూడా కల్పించారు.

హిరాకుడ్ ఎక్స్‌ప్రెస్‌కు తాత్కాలిక హాల్ట్

నార్తర్న్ రైల్వే, ఢిల్లీ డివిజన్ పరిధిలోని భోద్వాల్ మజ్రిలో జరగనున్న 78వ వార్షిక అంతర్జాతీయ నిరంకారీ సంత్ సమాగం కారణంగా హిరాకుడ్ ఎక్స్‌ప్రెస్‌కు ఈ స్టేషన్‌లో తాత్కాలిక హాల్ట్ కల్పించారు. అక్టోబరు 19 నుంచి నవంబరు 7 వరకు ఈ తాత్కాలిక హాల్ట్ ఉంటుంది. అమృత్‌సర్-విశాఖపట్నం (20808) హిరాకుడ్ ఎక్స్‌ప్రెస్ భోద్వాల్ మజ్రి స్టేషన్‌కు ఉదయం 5.52 గంటలకు చేరుకుని, 5.54 గంటలకు బయలుదేరుతుంది. అలాగే, విశాఖపట్నం-అమృత్‌సర్ (20807) హిరాకుడ్ ఎక్స్‌ప్రెస్ సాయంత్రం 3.48 గంటలకు చేరుకుని, 3.50 గంటలకు బయలుదేరుతుంది.

మరణించి నలుగురికి వెలుగునిచ్చి..





శ్రీను నేత్రాలను దానం చేసేందుకు అంగీకారం తెలుపుతున్న కుటుంబసభ్యుడు

పెందుర్తి : బ్రెయిన్ స్ట్రోక్‌తో మృతి చెందిన ఓ వ్యక్తి నేత్రాలను దానం చేసి ఓ కుటుంబం మానవత్వం చాటుకుంది. వివరాలివి.. పెందుర్తి ఆదిత్యనగర్‌లో నివాసం ఉంటున్న కోరుబిల్లి శ్రీను(40) క్రేన్ ఆపరేటర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. గురువారం రాత్రి శ్రీను ఒక్కసారిగా కుప్పకూలడంతో కుటుంబ సభ్యులు వెంటనే కేజీహెచ్‌కు తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం మృతి చెందాడు. ఈ క్రమంలో శ్రీను సమీప బంధువు శరగడం రాము(కర్రల రాము) చొరవతో కుటుంబ సభ్యులు శ్రీను నేత్రాలను దానం చేసేందుకు అంగీకరించారు. మోషిన్ ఐ బ్యాంక్ ప్రతినిధులు శ్రీను నేత్రాలను సేకరించారు. ఇటీవల కాలంలో విస్తృతంగా నేత్రదానం చేయిస్తున్న పెందుర్తిలోని సాయి హెల్పింగ్ హ్యాండ్స్ ట్రస్ట్ స్ఫూర్తిలో తాము ఈ నేత్రదానం చేసినట్లు కుటుంబ సభ్యులు వెల్లడించారు.

ఇన్‌స్టాగ్రామ్ ద్వారా వేధిస్తున్న వ్యక్తి అరెస్ట్

అల్లిపురం: ఫేక్ ఇన్‌స్టాగ్రామ్ ఖాతా క్రియేట్ చేసి ఒక మహిళ ఫొటోలు మార్ఫ్ చేసి న్యూడ్ వీడియో కాల్ చేయాలని లేదంటే తన ఇన్‌స్టాగ్రామ్ ఫాలోవర్స్ అందరికీ ఆ ఫొటోలు పోస్ట్ చేస్తానని ఓ వ్యక్తి బెదిరించాడు. సాంకేతికత సహాయంతో సైబర్ క్రైం పోలీసులు శుక్రవారం అతన్ని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాలివి.. నగరానికి చెందిన ఒక మహిళకు గుర్తు తెలియని ఫేక్ ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్ నుంచి తన ఫేస్‌తో అశ్లీలంగా మార్ఫ్ చేసిన ఫొటోలు వచ్చాయి. అలాగే ఇన్‌స్టాగ్రామ్ ద్వారా న్యూడ్ వీడియో కాల్ చేయాలని లేదంటే తన మార్ఫ్ చేసిన ఫొటోలు బాధితురాలి ఫాలోవర్స్ అందరికీ ఇన్‌స్టాగ్రామ్ ద్వారా ఫార్వర్డ్ చేస్తానని బెదిరింపు మెసేజ్‌లు వచ్చాయి. దీంతో బాధితురాలు భయాందోళనకు గురై సైబర్ క్రైం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాధితురాలి సాధారణ ఫొటోలను ఆమె ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్ స్టోరీస్ నుంచి డౌన్‌లోడ్ చేసుకుని.. ఆన్‌లైన్ అప్లికేషన్ ఉపయోగించి అశ్లీలంగా మార్ఫ్ చేసి మళ్లీ ఆమెకు పంపించింది నంద్యాల జిల్లాకు చెందిన వ్యక్తిగా పోలీసులు గుర్తించారు. సాంకేతికత సహాయంతో సదరు వ్యక్తిని అరెస్ట్ చేసి రిమాండ్‌కి తరలించారు.

ఖాతా తెరవని బుల్స్.. స్టీలర్స్ థ్రిల్లింగ్ గెలుపు



ఉత్కంఠగా సాగుతున్న మ్యాచ్

విశాఖ స్పోర్ట్స్: పోర్టు ఇండోర్ స్టేడియంలో జరుగుతున్న ప్రో కబడ్డీ లీగ్ 12వ సీజన్ అభిమానులను ఉర్రూతలూగిస్తోంది. శుక్రవారం జరిగిన మ్యాచ్‌ల్లో బెంగళూరు బుల్స్ మరో ఓటమిని చవిచూడగా, హర్యానా స్టీలర్స్ ఉత్కంఠ పోరులో విజయం సాధించి అభిమానులకు మజాను అందించింది. యూ ముంబాతో జరిగిన ఏకపక్ష మ్యాచ్‌లో బెంగళూరు బుల్స్ ఘోర పరాజయం పాలైంది. మ్యాచ్‌లో మూడుసార్లు ఆలౌట్ అయిన బుల్స్.. తొలి అర్ధభాగంలోనే 12–29తో భారీగా వెనుకబడింది. రెండో అర్ధభాగంలో బుల్స్ కాస్త పుంజుకున్నా, అప్పటికే జరగాల్సిన నష్టం జరిగిపోయింది. ఈ సీజన్‌లో బుల్స్ ఇంకా పాయింట్ల ఖాతా తెరవలేదు. మరో ఉత్కంఠభరితమైన మ్యాచ్‌లో డిఫెండింగ్ ఛాంపియన్ హర్యానా స్టీలర్స్ 35–30 పాయింట్ల తేడాతో యూపీ యోధాస్‌పై విజయం సాధించింది. నువ్వానేనా అన్నట్టు సాగిన పోరులో.. చివరి ఐదు నిమిషాల్లో దూకుడుగా ఆడిన స్టీలర్స్, యోధాస్‌ను రెండుసార్లు ఆలౌట్ చేసి విజయాన్ని కైవసం చేసుకుంది. శనివారం రాత్రి 8 గంటలకు పాట్నా పైరేట్స్, బెంగళూరు బుల్స్, రాత్రి 9 గంటలకు తమిళ్ తలైవాస్, గుజరాత్ జెయింట్స్ జట్లు తలపడనున్నాయి.

బస్సులు ఆపకపోవడంతో ప్రయాణికుల ఆగ్రహం

నరసాపురం జంక్షన్‌లో రోడ్డుపై ధర్నా



ప్రయాణికులతో నరసాపురం ప్రజలు వాగ్వాదం, వెనుక ఆగిపోయిన వాహనాలు



నరసాపురం జంక్షన్‌లో నిలిచిపోయిన పల్లె వెలుగు బస్సులు

పద్మనాభం: మండలంలోని తునివలస పంచాయతీ నరసాపురం జంక్షన్‌లో బస్సులు ఆపకపోవడంతో ఆ గ్రామ ప్రజలు, కళాశాల విద్యార్థులు శుక్రవారం జంక్షన్‌లో రోడ్డుపై ధర్నా చేశారు. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 11.30 గంటల వరకు వీరు రోడ్డుపై ఆందోళన చేపట్టారు. ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ప్రవేశపెట్టినప్పటి నుంచి విజయనగరం నుంచి వచ్చేటప్పుడు నరసాపురం జంక్షన్‌లో బస్సులు ఆపకుండా రెడ్డిపల్లిలో నిలుపుతున్నారు. ఉచితంగా మహిళలు ఎక్కువగా బస్సులు ఎక్కుతున్నారని డ్రైవర్లు బస్సులను నరసాపురంలో ఆపడం లేదు. రాత్రి వేళల్లోనూ బస్సులు నరసాపురం జంక్షన్‌లో ఆపకుండా రెడ్డిపల్లిలో నిలపడంతో సుమారు రెండు కిలోమీటర్ల దూరం చీకట్లో నడిచి రావాల్సి వస్తుండటంతో ప్రజలు, విద్యార్థులు ఆందోళనకు దిగారు. బస్సులకు అడ్డంగా రోడ్డు మీద వీరు నిలబడి పోయారు. సుమారు రెండు గంటల పాటు ట్రాఫిక్ స్తంభించింది. బస్సులు, ఆటోలు రోడ్డుపై నిలిచిపోయాయి. దీంతో డ్రైవర్లు, ప్రయాణికులు విద్యార్థులు, ప్రజలతో వాగ్వాదానికి దిగారు. చివరకు బస్సు డ్రైవర్లు నరసాపురంలో బస్సులో నిలుపుతామని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు.